సాక్షి బాపట్ల

శనివారం ; 23 ; నవంబర్ ; 2024




ఆలయ అభివృద్ధికి విరాళం

తాడేపల్లిరూరల్: కంఠంరాజు కొండూరు మహంకాళీ గుడి అభివృద్ధికి వడ్డేశ్వరానికి కె.శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతులు రూ.1,00,006 శుక్రవారం అందజేశారు.



సత్యసాయి జయంతి వేడుకలు

వినుకొండ(నూజెండ్ల): భగవాన్ సత్య సాయిబాబా జయంతి వేడుకలలో భాగంగా వినుకొండలో శుక్రవారం ఊరేగింపు, నగర ఉత్సవం, భజన హారతి నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 585.10 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 10,350 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

అవధూతస్వామి సమాధి వద్దకు నటుడు కృష్ణభగవాన్



చీరాల: సినీ నటుడు కృష్ణభగవాన్ శుక్రవారం చీరాలలో పర్యటించారు. చీరాలలోని ఫైర్ ఆఫీస్ గేటు అవతల ఉన్న అవధూత స్వామి ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. అవధూత స్వామి సమాధిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు తాను చీరాల వచ్చానన్నారు. మందిర కమిటీ నిర్వాహకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు.

పీఎం సూర్య ఘర్ పథకంతో ఉపయోగాలు

జిల్లా నోడల్ ఆఫీసర్ తులసీరామ్



చీరాల అర్బన్: ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా నోడల్ ఆఫీసర్ తులసీరామ్ అన్నారు. శుక్రవారం స్థానిక వాడరేవు రోడ్డులోని డివిజన్ కార్యాలయానికి వచ్చారు. పీఎం సూర్య ఘర్ పథకంపై ప్రజలకు మరింతగా అవగాహన కల్పించాలన్నారు. త్వరితగతిన విద్యుత్ వినియోగదారులను సోలార్ సిస్టమ్‌కు మారే అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈఈ కె.జాన్‌థామస్, సోలార్ కాంట్రాక్టర్లు, ఏఈఈ హరిప్రసాద్, ఏఈలు పాల్గొన్నారు.

గుంటూరు డీఏఆర్ డీఎస్పీగా ఏడుకొండలరెడ్డి

నగరంపాలెం: రాష్ట్రంలో 29 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖపట్నం సిటీ హోంగార్డ్స్ డీఎస్పీ (ఏఆర్) డి.ఏడుకొండలరెడ్డిని గుంటూరు జిల్లా డీఏఆర్ డీఎస్పీగా, గుంటూరు డీఏఆర్ డీఎస్పీ ఆర్‌పీఎల్ శాంతకుమార్‌ను ఇంటెలిజెన్స్‌కు, కోనసీమ డీఏఆర్ డీఎస్పీ పి.విజయసారథిని బాపట్ల జిల్లా డీఏఆర్ డీఎస్పీగా, బాపట్ల డీఏఆర్ డీఎస్పీ ఎస్.చంద్రమోహన్‌ను ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా డీఏఆర్ డీఎస్పీగా శుక్రవారం బదిలీ చేశారు.

అమరేశ్వరునికి లక్ష బిల్వార్చన



అమరావతి: అమరేశ్వరాలయంలో శుక్రవారం దాతల సహకారంతో అమరేశ్వరునికి లక్ష బిల్వార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. స్వామికి విశేష అలంకరణ చేసి సహస్ర నామాలతో రుత్విక్కులు అమరేశ్వరునికి లక్ష బిల్వ దళార్చన నిర్వహించారు. బాలచాముండికా అమ్మకు లక్ష కుంకుమార్చన చేశారు.



సూర్యలంకలో విధుశేఖరునికి స్వాగతం



ముత్తాయపాలెంలోని అభయ ఆంజనేయస్వామి విగ్రహానికి క్షీరాభిషేకం

శ్రీవిధు శేఖర భారతి.. విజయ హారతి

- తారకేశ్వరస్వామి గుడిగా నామకరణం చేసింది నేనే
- శ్రీవిధుశేఖర భారతీస్వామి వెల్లడి
- తారకేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

బాపట్లటౌన్: సూర్యలంక తీరంలో ఏర్పాటుచేసిన శివాలయానికి తారకేశ్వరస్వామి గుడిగా నామకరణ చేసేంది తానేనని శ్రీశృంగేరి శారదా పీఠం ఉత్తరాధికారి శ్రీ విధుశేఖర భారతీ స్వామి తెలిపారు. విజయ యాత్రలో భాగంగా శుక్రవారం ఉదయం బాపట్ల మండలంలోని సూర్యలంక సముద్రతీరానికి చేరుకున్న విధుశేఖర స్వామి తారకేశ్వరస్వామి గుడిని సందర్శించారు. తొలుత ముత్తాయపాలెంలోని అభయ ఆంజనేయస్వామి గుడి వద్ద స్వామికి క్షీరాభిషేకం చేసి హారతి ఇచ్చారు. తారకేశ్వరస్వామి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం విధుశేఖరస్వామి తారకేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అనుగ్రహభాషణం చేశారు. భవిష్యత్‌లో ఈ ఆలయానికి విశేష ఆదరణ లభిస్తుందన్నారు. ప్రాచీన కాలం తర్వాత పూర్తిగా రాతితో నిర్మించిన ఆలయం ఇదని పేర్కొన్నారు. ప్రాచీన శిల్పకళ ఉట్టిపడేలా ఈ గుడి నిర్మాణం జరగడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు, వేదపండితులు పాల్గొన్నారు.



తారకేశ్వరస్వామి ఆలయంలో అనుగ్రహభాషణం చేస్తున్న విధుశేఖర భారతీస్వామి



తారకేశ్వరస్వామి గుడిలో నవగ్రహాలకు ప్రత్యేక పూజలు

గిరిజనుల సమస్యలను పరిష్కరించాలి

కలెక్టర్ వెంకటమురళి

బాపట్లటౌన్: గిరిజనుల సమస్యలను తక్షణమే పరిష్కరించడమే ఎస్టీల ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కారవేదిక లక్ష్యమని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఎస్టీల కోసం ప్రత్యేక ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎస్టీలు సమస్యలతో కూడిన వినతి పత్రాలను కలెక్టర్‌కు అందజేశారు. కలెక్టర్ జె.వెంకటమురళి మాట్లాడుతూ ఇంటి స్థలం లేని ప్రతి ఎస్టీ కుటుంబానికి నివేశన స్థలం కేటాయించాలని అధికారులను ఆదేశించారు. తొలుత ఆధార్ కార్డుల సర్వే పూర్తిచేయాలన్నారు. ఆయా కాలనీలలో ప్రభుత్వ భూములు ఖాళీగా ఉంటే ఎస్టీలకు కేటాయించాలన్నారు. ఎస్టీ కుటుంబాలను మండల ప్రత్యేక అధికారులు దత్తత తీసుకుని ప్రభుత్వం అమలు చేసే పథకాలను వారికి వర్తింపచేయాలన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలన్నారు. వెదుళ్ళపల్లిలోని ఎస్టీ హాస్టల్ భవనంలో మార్కెట్ కొనసాగుతున్నందున అద్దె సొమ్ము గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయానికి చెల్లించాలన్నారు.

డిసెంబర్ 7న సీఎం బాపట్ల రాక

మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ బాపట్ల జిల్లాలో సమర్థంగా నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు డిసెంబర్ 7న బాపట్ల జిల్లాకు వస్తున్నారన్నారు. బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగే 'మెగా పేరెంట్ టీచర్ మీటింగ్'లో పాల్గొంటారన్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఖరారు కావడంతో బాపట్ల పట్టణంలోని మునిసిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణాన్ని కలెక్టర్ వెంకట మురళి, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్‌తో కలిసి శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తమ్, ఆర్డీఓ పి గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

- కిశోర బాలికల్లో రక్తహీనత నివారణే కిశోరి వికాసం ధ్యేయమని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కిశోరి వికాసంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం కిశోరి వికాసం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఉమా పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న గిరిజనులు

ధాన్యం సేకరణ వారంలో ప్రారంభించాలి

ధాన్యం సేకరణ వారం రోజుల్లో ప్రారంభించాలని అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం జేసీ చాంబర్‌లో జిల్లాలోని అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి మండలంలో గ్రామ సభలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఓపెన్ మార్కెట్లో ధాన్యాన్ని రైతులు అమ్ముకున్నా వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలన్నారు.

- ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి ఖచ్చితంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. మరుగుదొడ్ల అవశ్యకతను తెలియజేసే విధంగా అధికారులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు.

అధికారులు భూమిని గుర్తించాలి

ల్యాండ్ బ్యాంక్ కోసం రెవెన్యూ అధికారులు ఖాళీ భూమిని గుర్తించాలని కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టరేట్ నుంచి శుక్రవారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. 13 అంశాలపై అధికారులతో సమీక్షించారు. నీటి సంఘాల ఎన్నికలు డిసెంబర్ 8, 11, 14 తేదీల్లో సమర్థంగా నిర్వహించాలన్నారు.

విద్యాభివృద్ధికి చేయూతనిస్తాం

నెదర్‌ల్యాండ్ ప్రతినిధుల బృందం వెల్లడి

బల్లికురవ: గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి చేయూత ఇస్తామని నెదర్‌ల్యాండ్ బృందం సభ్యులు నీల్స్, టిన్నెట్, జాన్ వెల్లడించారు. ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.4.5 లక్షలతో పది కంప్యూటర్లు అందజేశారు. బృంద సభ్యులు శుక్రవారం కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించి సంతృప్తి చెందారు. నెదర్‌ల్యాండ్ ప్రతినిధులు మాట్లాడుతూ నేటి సమాజంలో కంప్యూటర్ ఆవశ్యకత పెరిగిందని, విద్యతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ పెంచుకోవాలన్నారు. బాలబాలికలు జీవితంలో స్థిర పడేవరకు వివాహాలు చేసుకోవద్దని, బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వారు వివరించారు. అనంతరం కళాశాలలోని మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులతో ముచ్చటించి వారి సమస్యలు తెలుసుకున్నారు. కళాశాల క్రీడా మైదానంలో నీడనిచ్చే పలు రకాల మొక్కలు నాటారు. విద్యార్థులతో జరిగిన సమావేశంలో దూర ప్రాంతాల నుంచి ఇక్కడ కళాశాలకు వచ్చి చదువుకుంటున్నామని విద్యార్థులు చెప్పారు. బస్సు సౌకర్యాలు సక్రమంగా లేనందున ఇబ్బందులు పడుతున్నామని, రాకపోకలకు సైకిళ్లు అందజేసి తోడ్పాటునివ్వాలని పలువురు విద్యార్థులు సభ్యుల దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం అనిల్ కుమార్, అధ్యాపకులు ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



బల్లికురవ కళాశాలలో మొక్కలు నాటుతున్న నెదర్‌ల్యాండ్ బృంద సభ్యులు

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకు దుర్మరణం

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకు మృతి చెందిన ఘటన తెనాలి మండలం ఖాజీపేట వద్ద శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు ..... కొల్లిపర మండలం తూములూరు గ్రామానికి చెందిన అవుతు రవీంద్రరెడ్డి(50) తన కుటుంబంతో పెదకాకాని మండలం నంబూరులో ఉంటున్నాడు. తన పిన్నమ్మ మృతి చెందడంతో అంత్యక్రియల్లో పాల్గొనేందుకు స్వగ్రామానికి భార్య సురేఖ, కొడుకు హర్షవర్ధన్‌రెడ్డి(19)తో కలిసి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో బైక్‌పై వెళుతున్న వీరిని ఖాజీపేట వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. దీంతో హర్షవర్ధన్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన రవీంద్రరెడ్డిని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. రవీంద్రరెడ్డి భార్య సురేఖ స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఘటనాస్థలాన్ని రూరల్ పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు

- డిసెంబరులో నిర్వహణకు సన్నాహాలు
- సంబంధిత అధికారులు, సిబ్బందికి శిక్షణ

గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలోని సాగునీటి సంఘాల వ్యవస్థను మళ్లీ కూటమి సర్కారు ఇప్పుడు అమల్లోకి తీసుకొస్తోంది. డిసెంబరు రెండో వారంలో ఎన్నికలకు ముహూర్తం నిర్ణయించారు. వీటి నిర్వహణకు ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. కృష్ణాడెల్టా పరిధిలోని పశ్చిమ డెల్టాలోనూ ఇందుకు సంబంధించిన సన్నాహాలు చురుగ్గా జరుగుతున్నాయి.

తెనాలి: కృష్ణా పశ్చిమ డెల్టాలో 5.71 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఉమ్మడి జిల్లాగా ఉన్నపుడు గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో ఇది ఉండేది. అత్యధికం తెనాలి డివిజనులోనే ఉంది. జిల్లాల విభజన అనంతరం ఇప్పుడు పశ్చిమ డెల్టా పరిధి గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు విస్తరించింది. ఆ ప్రకారం ఇప్పుడు సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి.

పశ్చిమ డెల్టాలో మొత్తం 144 సంఘాలుగా నిర్ణయించారు. వీటిలో గుంటూరు జిల్లాలో 50, బాపట్ల జిల్లాలో 92, ప్రకాశం జిల్లాలో రెండు చొప్పున ఉన్నాయి. డిస్ట్రిబ్యూటరీ కమిటీలు 20 కాగా, జిల్లాలో 6, ప్రకాశం జిల్లాలో 14 ఉన్నాయి. గుంటూరు చానల్ పరిధిలో మరో 14 సాగునీటి సంఘాలు, రెండు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. వీటన్నింటిపై ప్రాజెక్టు కమిటీ ఉంటుంది. సాగునీటి సంఘాల ఎన్నికలకు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పర్యవేక్షిస్తారు. మూడు జిల్లాలకు ముగ్గురు నోడల్ అధికారులను నియమించారు. జిల్లాకు జలవనరుల శాఖ గుంటూరు ఈఈ కె.రమేష్, బాపట్లకు గుంటూరు జిల్లా ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఇంజినీరు పులిపాటి వెంకటరత్నం, ప్రకాశం జిల్లాకు జలవనరుల శాఖ ఏఈ శంకరరావు నియమితులయ్యారు. సాగునీటి సంఘాలకు డిసెంబరు నెల 5వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేస్తారు. 8న సాగునీటి సంఘాలకు, 11న డిస్ట్రిబ్యూటరీ సంఘాలకు 14న ప్రాజెక్టు కమిటీకి ఎన్నికలను నిర్వహిస్తారు. సాగునీటి సంఘాల ఎన్నికలు రెండు విభాగాలుగా జరుగుతాయని అధికారులు తెలియజేశారు. ఉదయం టీసీ సభ్యుల ఎన్నిక (ప్రాదేశిక సభ్యులు) నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆయా సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు జరుగుతాయి.



సీతానగరం వద్ద కృష్ణాపశ్చిమ డెల్టా హెడ్ స్లూయిస్

ఇవీ నిబంధనలు

18 ఏళ్లు ఆపై వయసు కలిగినవారు పోటీ చేయొచ్చు. ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు, రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నవారు, పారితోషికాలు పొందేవారు కూడా పోటీకి అనర్హులు. ఎన్నికల్లో పోటీ చేసేవారు నీటి శిస్తు చెల్లించి ఉండాలనే నిబంధన ఉంది. ఇక ఎన్నికలను మూడు విధాలుగా జరుపుతారు. తొలుత అభ్యర్థులను అక్షరమాల ప్రకారం వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు. ముందుగా ఏకగ్రీవం అవుతుందేమో చూస్తారు. లేకుంటే అభ్యర్థుల వరుసక్రమం ప్రకారం తొలి అభ్యర్థిని వేదికపైకి పిలిచి చేతులు పైకెత్తే విధానంలో ఎన్నిక నిర్వహిస్తారు. ఎవరికి ఎక్కువ మంది మద్దతునిస్తే వారిని విజేతలుగా ప్రకటిస్తారు. ఈ విధానం వీలుపడకపోతే రహస్య బ్యాలెట్‌ను అనుసరిస్తారు. ఓటు వేసే రైతులకు పట్టాదారు పాసు పుస్తకం లేకపోయినా హక్కును నిరాకరించరు. ఓటరు కార్డు, ఆధార్ కార్డు లేదా ఏ ఇతర గుర్తింపు కార్డుతోనైనా ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.

సర్వసన్నద్ధం



సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు దాదాపు పూర్తి చేశాం. ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ఎన్నికలు సజావుగా జరిగేలా తగిన చర్యలు తీసుకుంటున్నాం.

– పులిపాటి వెంకటరత్నం, జలవనరుల శాఖ ఇన్‌చార్జి ఎస్ఈ

బడిలో గంటశోష!

- పెరిగిన గంట పని భారం
- సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలు
- 25 నుంచి పైలెట్ ప్రాజెక్ట్‌గా అమలు
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ పాఠశాలల పని వేళలు మరో గంట పెంచుతూ కూటమి సర్కారు తీసుకున్న నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ ప్రభుత్వం అధికారం చేపట్టాక వారిపై పనిభారం పెరుగుతోంది. యాప్‌లలో అప్‌లోడింగ్, అపార్ నమోదు వంటి ఊపిరి సలపని పనులతో ఇప్పటికే వారు సతమతమవుతున్నారు. ఇప్పుడు గంట పని భారం పడుతుండడంతో నిరసన గళం వినిపిస్తున్నారు. మరోవైపు ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం స్పందించడం లేదు. ఈ ప్రభుత్వం వచ్చి ఐదునెలలు గడుస్తున్నా బకాయిల చెల్లింపు విషయంలో అడుగు ముందుకు పడలేదు. మధ్యంతర భృతి ప్రకటన మృగ్యమైంది. ఒకటో తేదీనే జీతాలు అందుతాయన్న ఆశ ఆగస్టు నెలలోనే అడుగంటింది.

తొలుత పైలెట్ ప్రాజెక్టుగా..

తొలుత పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలో ఎంపిక చేసిన 11 పాఠశాలల్లో కొత్త పనివేళలు ఈనెల 25 నుంచి అమలు కానున్నాయి. ఉదయం 9 గంటలకు ప్రారంభమై 5 గంటల వరకు పనిచేస్తాయి. చలికాలంలో సాయంత్రం 5.30 గంటలకే చీకట్లు ముసురుతున్న నేపథ్యంలో ఇటువంటి నిర్ణయం తీసుకోవడం సరికాదని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. అయితే 30వ తేదీ వరకు ఎంపిక చేసిన పాఠశాలల్లో పనివేళలు అమలు చేసి ఫలితాలపై సమీక్షించి ఆ తర్వాత తుది నిర్ణయం ఉంటుందని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు.



భిన్నాభిప్రాయాలు..

పాఠశాలల్లో గంట పని వేళ పెంచటం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుకునేందుకు సమీప గ్రామాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. ఉదయం 9గంటలకు పాఠశాల ప్రారంభమైతే విద్యార్థులు ఇంటి వద్ద నుంచి ఒక గంట ముందుగా బయలుదేరాల్సి ఉంటుంది. ఉదయం 8గంటలకు ఇంటి వద్ద నుంచి బడికి వచ్చిన విద్యార్థి తిరిగి సాయంత్రం 5గంటలకు పాఠశాల ముగించుకొని ఇంటికి వెళ్లేసరికి దాదాపు సాయంత్రం 6 గంటలు అవుతుంది. దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి లోనవుతారని చెబుతున్నారు. దీంతోపాటు ఒక్కో పీరియడ్ 45 నిమిషాల చొప్పున 8 పీరియడ్లు పెట్టడం వల్ల విద్యార్థులు మరింత అలసిపోయే ప్రమాదముందని పేర్కొంటున్నారు. ఉపాధ్యాయులపైనా రెట్టింపు భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులూ ఉదయం 7 లేదా 8 గంటలకే ఇంటివద్ద నుంచి పాఠశాలకు బయలుదేరి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలోనే ఉండి తిరిగి ఇంటికి చేరుకునేందుకు సాయంత్రం 6 లేదా 7 గంటలు అవుతుందని, ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయినులకు ఇది కష్టంగా మారుతుందని, ఈ ప్రభావం బోధనపై తీవ్రంగా పడుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పాఠశాలల పని వేళలు మార్చాలంటే విద్యార్థుల మానసిక స్థితి, విద్యార్థి అభ్యాసన సంసిద్ధత, విద్యార్థినుల భద్రత, రవాణా తదితర అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుందని పేర్కొంటున్నారు. ఆంధ్రప్రదేశ్ చుట్టుపక్కల ఏ రాష్ట్రాలలోనూ పాఠశాలలు ఐదు గంటల వరకు పని చేయడం లేదని, అత్యధిక అక్షరాస్యతా శాతం ఉన్న కేరళలోనూ సాయంత్రం 3 గంటల వరకే బడులు పనిచేస్తున్నాయని ఉదహరిస్తున్నారు.

ఒత్తిడి పెరుగుతుంది



పాఠశాల పని వేళల మార్పు విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తోంది. బోధన సమయానికి ఆటంకంగా ఉన్న యాప్‌ల భారాన్ని తొలగించి బోధనకు సమయాన్ని కేటాయించటం ద్వారా విద్యార్థికి లబ్ధి చేకూరుతుంది. ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించాలి.

– ఎల్.వి.రామిరెడ్డి, పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ఎస్టీయూ

పల్నాటి ఉత్సవాలకు పకడ్బందీ చర్యలు

పల్నాడు ఎస్పీ శ్రీనివాసరావు

కారెంపూడి: పల్నాటి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటామని ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 30 నుంచి పల్నాటి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పల్నాటి వీరుల గుడిని ఎస్పీ సందర్శించారు. పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ఎస్పీకి లాంఛనంగా స్వాగతం పలికారు. అనంతరం వీరుల గుడిలో పల్నాటి వీరుల ఆయుధాలను ఎస్పీ పరిశీలించారు. ఆయుధాల విశిష్టతను పల్నాటి వీరాచార పీఠం నిర్వాహకుడు విజయ్‌కుమార్ ఎస్పీకి వివరించారు. కన్నమదాసు భైరవ ఖడ్గాన్ని, ఇతర ఆయుధాలను ఎస్పీ పరిశీలించారు. ఆయుధాలన్నీ ఆనాటివేనని, అయితే కొన్నింటికి కర్రలు మార్చడం జరిగిందని పీఠాధిపతి తెలిపారు. వీరాచారం నెరవేర్చలేని వారిచ్చిన కొన్ని ఆయుధాలు వీరుల గుడిలో ఉన్నాయని, మిగిలిన అన్ని ఆయుధాలు వంశపారంపర్యంగా పల్నాటి వీరాచారుల వద్దే ఉంటూ వస్తున్నాయని ఉత్సవాలకు వారు వంశపారంపర్యంగా వస్తున్న తమ ఆయుధాలతో తరలివచ్చి వీరులను తలుచుకుని తమ వీరాచారాన్ని నెరవేర్చుకుని వెళతారని వివరించారు. ఎస్పీ వీరుల గుడిని, నాగులేరును పల్నాటి యుద్ధం జరిగిన నాగులేరు తీరాన్ని పరిశీలించారు. ఉత్సవాల నిర్వహణ తీరు ఎలా ఉంటుందనే విషయమై పీఠాధిపతిని ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. డిసెంబరు రెండవ తేదీ బ్రహ్మనాయుడు చాపకూడు సిద్ధాంతం అమలు నాడు, 3వ తేదీ కోడిపోరు నాడు ప్రజల రాక ఎక్కువగా ఉంటుందని, ఉత్సవాల చివరిరోజు వీరుల ఆయుధాలు కళ్లికి ఒరిగే సమయంలో తోపులాట, ఉద్రిక్తత ఉంటుందని పీఠాధిపతి వివరించారు. ఉత్సవాలకు లక్షన్నరదాకా ప్రజలు వచ్చే అవకాశం ఉందని, ఈ ఏడాది ఇంకా ఎక్కువగా రావచ్చని భావిస్తున్నామన్నారు.



కన్నమదాసు ఆయుధాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ, చిత్రంలో పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ

క్లుప్తంగా

పాత పని వేళల్లోనే పాఠశాలలు కొనసాగించాలి

మార్టూరు: రాష్ట్రంలో ఉన్నత పాఠశాలల పని వేళలను మార్చడం సముచితం కాదని.. పాత సమయాల్లోనే కొనసాగించాలని స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చింతల సుబ్బారావు, పి. సర్వోత్తమ్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఉన్నత పాఠశాలల పనివేళలను సాయంత్రం ఐదు గంటల వరకు పెంచడం వలన ఎదురయ్యే సమస్యల గురించి రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని వారు కోరారు. విద్యార్థుల మానసిక స్థితి, అభ్యసన సంసిద్ధత, రవాణా సౌకర్యం, విద్యార్థుల భద్రత తదితర అంశాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఇప్పటికీ ఐదు నుంచి పది కిలోమీటర్ల దూరం నుంచి ఉన్నత పాఠశాలకు వస్తుంటారని, పనివేళల మార్పు వలన వారికి సరైన రవాణా సౌకర్యం ఉండదని, బాలికల భద్రత సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వారు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాల్లో అమలు జరుగుతున్న పనివేళల గూర్చి అధ్యయనం చేసి మానసిక వైద్యుల సలహాలు తీసుకోవాలని వారు ప్రకటనలో కోరారు.

హిందీ భాషకు ప్రోత్సాహం అవసరం



లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో హిందీని ప్రోత్సహించటానికి కృషి చేయాలని మేనేజర్ ఎం.రామకృష్ణ అన్నారు. పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో శుక్రవారం ఏడీఆర్ఎం సైమన్ అధ్యక్షతన అధికార భాషా అమలు కమిటీ సమావేశం జరిగింది. ముందుగా ప్రముఖ హిందీ కవి హరివంశ్ రాయ్ బచ్చన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. డీఆర్ఎం మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అన్ని కార్యాలయాల్లో అధికార భాషకు సంబంధించిన ప్రగతి నివేదికను సమీక్షించారు.

శాంతిభద్రతల పరిరక్షణలో 'కూటమి' విఫలం

- నాయకులకు పదవీ వ్యామోహం తప్ప ప్రజలపై దృష్టి లేదు
- అరగంటకో నేరం
- యర్రగొండపాలెం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్
- నరసరావుపేటలో క్షతగాత్రుడికి పరామర్శ



పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

నరసరావుపేట: రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పేర్కొన్నారు. పొలం తగాదాల విషయంలో ప్రత్యర్థుల దాడిలో తీవ్రంగా గాయపడి పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న తన నియోజకవర్గంలోని శివపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఈశ్వర రెడ్డిని శుక్రవారం సాయంత్రం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వ వైఫల్యం మూలంగా ప్రతిరోజూ రాష్ట్రంలో ఏదో ఒక మూల హత్యలు, దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. నేరస్తులను శిక్షిస్తారనే భయం లేకపోవటం వలనే దాడులకు పాల్పడుతున్నారని, ఒక చిన్న పొలం తగాదా విషయంలో గొడ్డలి, కత్తులతో నరకటంతో చావు బ్రతుకుల మధ్య వెంటిలేటర్‌పై ఉన్నాడంటే రాష్ట్రంలో ఏరకమైన పరిపాలన సాగుతుందో అర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రజలు, ఆడబిడ్డలకు రక్షణ లేదని, నేరం చేయడానికి ఎవరూ భయపడట్లేదన్నారు. వందల కేసులు రోజూ నమోదవుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వంలో అరగంటకు ఒక అత్యాచారం చొప్పున జరుగుతున్నాయన్నారు. ఐదు నెలల్లో 7393 మహిళలపై అత్యాచారాలు, దాడులు జరిగాయని అసెంబ్లీ సాక్షిగా వారే చెప్పారన్నారు. ఐదేళ్లలో 35 వేలకు పైగా సంఘటనలు జరగనిచ్చి ఒక రికార్డు బుక్ చేయాలనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రజల రక్షణ గాలికి వదిలేసిన పరిస్థితి స్పష్టంగా కన్పిస్తుందన్నారు. తన నియోజకవర్గంలో ఈ క్షతగాత్రుడికి త్రిపురాంతకంలో 14ఎకరాల పొలం ఉందన్నారు. వీటిపై కోర్టులో దావాలు, గొడవలు కూడా జరుగుతున్నాయన్నారు. ఈశ్వర రెడ్డి ప్రత్యర్థులను పోలీసులు ముందుగానే కట్టడి చేసి ఉంటే ఈ దారుణం జరిగి ఉండేది కాదన్నారు. డెప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్రంలోని మహిళలకు తాము రక్షణ కల్పించలేమని, వారి కుటుంబ సభ్యులే రక్షణ చేసుకోవాలని వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. దీని అర్థం మేం ఏమిచేయలేమని చెప్పకనే చెప్పినట్లుగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలుచేయలేక తమకు ఇవ్వాల్సిన పీఏసీ చైర్మన్ పదవిని ఎగ్గొట్టారన్నారు. స్వతంత్ర భారత చరిత్రలో ఆ పదవి ఇవ్వకపోవటం ఇదే మొదటిసారి అన్నారు. వారు చేసే తప్పులను బయటకు తీస్తారనే ఉద్దేశంతో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పీఏసీ సభ్యులైన తమకు ఆ పదవి రాకుండా చేశారన్నారు. 1981లో బీజేపీకి పార్లమెంటులో రెండే రెండు సీట్లు ఉంటే పీఏసీ పదవి ఇచ్చారన్నారు. ప్రజాపద్దుల విషయంలో ప్రతిపక్షం ప్రజలవైపు నిలబడుతుందన్నారు. పదవీ వ్యామోహం వలనే ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు మరో పదేళ్లు ఉండాలని పవన్ కల్యాణ్ అన్నారన్నారు. వీరికి పదవీ వ్యామోహం తప్పితే ప్రజల కోసం పోరాటం చేసే ఆలోచన ఏ కోశానా లేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రజలకు కూటమి ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు.

మద్యం దుకాణాలు నిబంధనలు పాటించాలి

తెనాలి రూరల్: మద్యం దుకాణాలలో కచ్చితంగా నిబంధనలు పాటించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె. శ్రీనివాసులు స్పష్టం చేశారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి.అరుణకుమారితో కలిసి శుక్రవారం ఆయన తెనాలి కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ.. ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలన్నారు. బెల్టు షాపులు పెడితే సహించేది లేదని చెప్పారు. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌విక్రయిస్తూ పట్టుబడితే మొదటి తప్పు కింద రూ. 5 లక్షల జరిమానా విధిస్తామని, రెండో సారి పట్టుబడితే లైసెన్సు రద్దు చేసి దుకాణాన్ని ఇతరులకు కేటాయిస్తామని చెప్పారు. జనవరి ఒకటో తేదీ నుంచి గురువారం వరకు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో తమ శాఖ 2,687 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. 2,501 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కొత్త పాలసీ వచ్చిన అక్టోబరు 16వ తేదీ నుంచి గురువారం వరకు 235 కేసులు నమోదు చేసి 215 మందిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఎక్సైజ్ సీఐలు తమ పరిధిలోనే కాకుండా ఇతర సీఐల పరిధిలోనూ బెల్టు షాపుల తనిఖీలు చేసేందుకు ఉన్నతాధికారులు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం. యశోదర దేవి, సబ్ ఇన్‌స్పెక్టర్ టి. ఫణికుమార్, ఆర్. శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

అంబేడ్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి

ఏఎన్‌యూ: అంబేడ్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ కోరింది. ఈ మేరకు శుక్రవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పోస్ట్ కార్డుల ఉద్యమాన్ని నిర్వహించింది. యూనివర్సిటీ అంబేడ్కర్ అధ్యయన కేంద్రం తదితర విభాగాల్లో సంతకాల సేకరణ చేపట్టారు. తమ డిమాండ్‌ను పోస్ట్ కార్డులపై రాసి సంతకాలు చేశారు. అంబేడ్కర్ గొప్పతనాన్ని భావి తరాలకు తెలియజేయాలంటే ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశంగా మార్చాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ నాయకులు, యూనివర్సిటీ అంబేడ్కర్ చైర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లింపులపై ప్రభుత్వం శ్వేతపత్రం ప్రకటించాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న యూటీఎఫ్ సభ్యులు

ఇంకొల్లు (చినగంజాం): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలపై శ్వేత పత్రం ప్రకటించి వాటి చెల్లింపుకు నిర్దిష్టమైన ప్రణాళిక ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్ పాపారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంకొల్లు జెడ్పీ హైస్కూల్‌లో ఇంకొల్లు మండల యూటీఎఫ్ కౌన్సిల్ ఎన్నిక సమావేశం నిర్వహించారు. ఎన్నికల పరిశీలకుడిగా హాజరైన పాపారావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనులను తగ్గించి, యాప్‌లను బారినుంచి విముక్తి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. యూటీఎఫ్ ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సంఘంలో పనిచేసిన నాయకులను సన్మానించారు. పీవీ సుబ్బారావు, కే జే జయరాజ్, ఆవుల హనుమంతరావు, కరి కమలేశ్వరరావు, కే వీరాంజనేయులు, వీ ఉదయకుమారి, యం రాఘవరావు, రిటైర్ కాబోతున్న సీహెచ్ హనుమంతరావు, వీ సుబ్బారావు, ఎన్ శోభారాణిలను సన్మానించారు.

ఇంకొల్లు మండల శాఖ ఎన్నిక..

అనంతరం యూటీఎఫ్ మండల శాఖ కార్యవర్గం ఎన్నికల్లో గౌరవాధ్యక్షుడిగా ఎస్ సమత, అధ్యక్షుడిగా పీ సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా వీ శ్రీమన్నారాయణ, జే అనిత, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కే మస్తాన్‌వలి, కోశాధికారిగా ఎం మాధవ, కార్యదర్శులుగా టీ వాణీశ్రీ, టీ శ్రీనివాసరావు, కే శ్రీనివాసరావు, యం శ్రీనివాసులు,పీ చంద్రారెడ్డి, ఎస్ మస్తాన్ సాహెబ్, జిల్లా కౌన్సిలర్లుగా వీవీ సుబ్బారావు, శివరామకృష్ణ ప్రసాద్, వివిధ కమిటీల కన్వీనర్లుగా కే సురేష్, కే పుష్పావతి, పీ పావని, కే సునీల్ కుమార్, జే గోపికృష్ణ, ఎస్ ప్రభావతి, వీ హనుమాయమ్మ, కే రాజశేఖర్‌లు ఎంపికయ్యారు.

200 లీటర్ల బెల్లం ఊట, బట్టీ ధ్వంసం



దిండిలో దాడులు నిర్వహిస్తున్న నగరం ఎక్సైజ్ సీఐ శ్రీరామ్ ప్రసాద్, సిబ్బంది

నిజాంపట్నం: నాటుసారా తయారు చేసే, అమ్మకాలు చేసే వ్యక్తులపై నిరంతర నిఘా ఉంటుందని నగరం ఎక్సైజ్ సీఐ మార్టూరి శ్రీరామ్‌ప్రసాద్ తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ఒంగోలు ఆదేశాల మేరకు నిజాంపట్నం మండలం దిండి పంచాయతీ పరిధిలోని జంపనివారిపాలెం పరిసర ప్రాంతాల్లో శుక్రవారం దాడులు నిర్వహించారు. సీఐ శ్రీరామ్ ప్రసాద్ మాట్లాడుతూ జంపనివారిపాలెం ప్రాంతానికి దక్షిణ దిశగా రెండు కిలోమీటర్ల దూరంలోని మడ అడవుల్లో దాడులు చేసినట్లు తెలిపారు. ఒక ప్రాంతంలో నాటుసారా తయారీ కోసం దాచి ఉంచిన 200 లీటర్ల బెల్లం ఊటను, బట్టీని ధ్వంసం చేసినట్లు చెప్పారు. నాటుసారా తయారీ, అమ్మకాలు చేసే వ్యక్తుల సమాచారాన్ని తమకు స్థానికులు తెలియజేయాలని ఆయన కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. మండలంలో నల్ల బెల్లం అమ్మే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటరమణ, శ్రీనివాసరెడ్డి, మధుసూదనరావు పాల్గొన్నారు.

ఖోఖో రాష్ట్ర బాలుర జట్టుకు శిక్షణ పూర్తి

ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీఘర్‌లో జాతీయస్థాయి ఖోఖో పోటీలు



శిక్షణ తీసుకున్న రాష్ట్ర ఖోఖో జట్టు

జే.పంగులూరు: జాతీయ స్థాయి ఖోఖోలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు శిక్షణ శిబిరం ముగిసినట్లు రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి తెలిపారు. శుక్రవారం పంగులూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 25 నుంచి 29 వరకు ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలోని అలీఘర్ పట్టణంలో 43వ జూనియర్ బాలబాలికల జాతీయ స్థాయి ఖోఖో పోటీలు జరగనున్నాయన్నారు. 20 రోజుల నుంచి స్థానిక మంగుల సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్ర జట్టుకు శిక్షణ జరుగుతున్నట్లు తెలిపారు. జట్టుకు కోచ్‌గా ప్రకాశం జిల్లా డీఎస్ఏ కోచ్‌గా డీఎల్ రెడ్డి వ్యవహరించారని తెలిపారు. రాష్ట్ర శిక్షణ జట్టుకు భోజన వసతులు కల్పించిన గ్రామ పెద్దలు, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావుకి సీతారామిరెడ్డి, క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారులకు దుస్తులు అందించిన నెల్లూరి పీడీ రాజా, బాలికలకు ఎస్ఆర్ స్పోర్ట్స్ తరుపున సీతారామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారులకు గ్రామ పెద్దలు రాయిణి వెంకటసుబ్బారావు, జాగర్లమూడి సుబ్బారావు, బాచిన చౌదరిబాబు, పీడీ మేకల సీతారామిరెడ్డి క్రీడాకారులకు క్రీడాదుస్తులు అందించారు. ఆటలలో రాణించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ బాచిన చెంచుగరటయ్య, రాష్ట్ర ఖోఖో చీఫ్ ప్యాట్రన్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి (ఎమ్మెల్యే), రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్, రిఫరీస్ బోర్డు కన్వీనర్ ప్రసాద్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజరాజేశ్వరి వారిని ఆశీర్వదించారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

మూడు బైకులు స్వాధీనం



బైకుల చోరీ కేసు వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు, చిత్రంలో నిందితుడు, స్వాధీనం చేసుకున్న బైకులు

విజయవాడ స్పోర్ట్స్: గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ఘరానా దొంగను సీసీఎస్, పటమట పోలీసులు అరెస్ట్ చేశారు. పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం, మాదాల గ్రామానికి చెందిన నిందితుడు తమ్మిశెట్టి వెంకటేష్ నుంచి మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను వన్‌టౌన్‌లోని సీసీఎస్ పోలీస్ స్టేషన్ వద్ద సెంట్రల్ ఏసీపీ దామోదర్, సీసీఎస్ సీఐ రామ్‌కుమార్, పటమట సీఐ పవన్‌కిశోర్ శుక్రవారం వెల్లడించారు. సీసీఎస్ పోలీసులకు వచ్చిన ముందస్తు సమాచారంతో ఆటోనగర్ చెక్ పోస్ట్ వద్ద శుక్రవారం వాహనాల తనిఖీలు నిర్వహించామని, తనిఖీలు జరుగుతున్న సమయంలో నిందితుడు అటుగా వస్తూ.. ఒక్కసారిగా బైక్ వెనక్కి తిప్పుకుని పారిపోయేందుకు ప్రయత్నించాడని వారు తెలిపారు. దీంతో అనుమానం వచ్చి అతడిని వెంబడించి అదుపులోకి తీసుకున్నామన్నారు. విచారణలో నిందితుడు బైక్‌లను చోరీ చేస్తున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. 24 ఏళ్ల వయసున్న నిందితుడు వెంకటేష్ గంజాయి, మద్యపానానికి అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించేందుకు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. నిందితుడిపై గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో ఐదు చోరీ కేసులున్నాయని, నిందితుడి నుంచి మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

రాత్రి వేళ భద్రత ప్రశ్నార్థకం

- అర్బన్ పీహెచ్‌సీ వైద్యుల ఆవేదన
- కేంద్ర సహాయ మంత్రికి ఫిర్యాదు

గుంటూరు మెడికల్: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రాత్రి వేళల్లో విధులు నిర్వహించలేని పరిస్థితి ఉందని పలువురు వైద్యులు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ – ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను మంత్రి పరిశీలించారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిని అక్కడి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. డ్రెస్సింగ్ అండ్ ఎమర్జెన్సీ రూం, ఫార్మసీ, మెటర్నటీ, పురుషుల విభాగం, అడ్మినిస్ట్రేషన్ తదితర విభాగాలను పెమ్మసాని పరిశీలించారు. వైద్యాధికారులతో మాట్లాడి హెల్త్ సెంటర్ నిర్వహణ, విధి విధానాలను అడిగి తెలుసుకున్నారు. సౌకర్యాల గురించి రోగుల వద్ద ఆరా తీశారు. రాత్రి వేళల్లో పలువురు ఆగంతుకులు అర్బన్ పీహెచ్‌సీ ప్రాంగణంలోకి గంజాయి మత్తులో వస్తున్నారని చెప్పారు. ఆ మత్తులో హెల్త్ సెంటర్ వద్ద ఆందోళన సృష్టిస్తున్నారని, రాత్రి వేళలో భద్రత లేదని పలువురు వైద్యులు ఫిర్యాదు చేశారు. అర్బన్ పీహెచ్‌సీ సెంటర్ ప్రహరీ నిర్మాణం పెండింగ్‌లో ఉందన్నారు. మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ మరోసారి గంజాయి బ్యాచ్ ఆసుపత్రి పరిసరాల్లో కనిపించకుండా చేయాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. ప్రహరీ మంజూరైనా నిర్మాణం చేపట్టని కాంట్రాక్టర్ కుమార్‌తో ఫోన్లో మాట్లాడారు. ఆలస్యానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే నిర్మాణం పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం విలేకరులతో పెమ్మసాని మాట్లాడుతూ.. గుంటూరు జీజీహెచ్‌పై విపరీతమైన ఒత్తిడి ఏర్పడుతోందని చెప్పారు. అందరూ స్థానికంగా ఉండే అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లకు వెళ్లకుండా జీజీహెచ్‌కి రావడమేఒత్తిడి పెరగడానికి కారణమని పేర్కొన్నారు. ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో సౌకర్యాలు ఉన్నాయని, అన్ని వ్యాక్సిన్లు కూడా వేస్తారని వెల్లడించారు. హెల్త్ సెంటర్ సమీపంలో ఉన్న రైతు బజార్‌ను మంత్రి పరిశీలించారు. సమస్యలను వ్యాపారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. చిన్న అభివృద్ధి కార్యక్రమాలు చేపడితే స్థానికంగా రైతు బజారుకు డిమాండ్ పెరుగుతుందన్న వ్యాపారుల విజ్ఞప్తి మేరకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

బాలికా విద్య కోసం తపించిన ఉన్నవ దంపతులు



లక్ష్మీబాయమ్మ జీవితసాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న శ్రీరంగనాయకి, లక్ష్మణరెడ్డి, కోటిరత్నం, శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: బాలికా విద్యకోసం శ్రమించిన ఉన్నవ లక్ష్మీనారాయణ, లక్ష్మీబాయమ్మ దంపతులు చరితార్థులని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు. బ్రాడీపేటలోని శ్రీశారదానికేతన్ మహిళా విద్యాసంస్థ 102వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరెడ్డి మట్లాడుతూ.. 1922లో బాలికా, మహిళా విద్య కోసం శారదానికేతనాన్ని స్థాపించిన ఉన్నవ దంపతులు స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని అన్నారు. ఉన్నవ లక్ష్మీనారాయణ రచించిన మాలపల్లి నవల దళితుల బాధలను, అంటరానితనాన్ని ఆనాటి ప్రజల కళ్ల ముందు ఉంచినట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మొదటి వితంతువు వివాహాన్ని కందుకూరి వీరేశలింగంతో కలిసి గుంటూరులో చేయించారని తెలిపారు. గాంధీజీ శారదానికేతనాన్ని సందర్శించి స్వాతంత్ర్య ఉద్యమ నేతలతో సమావేశాన్ని నిర్వహించారని గుర్తుచేశారు. వీవీ గిరి, సి. రాజగోపాలాచారి వంటి మహనీయులు వార్షికోత్సవ సభలకు హాజరయ్యారని తెలిపారు. 10 మంది విద్యార్థినులతో ప్రారంభమైన శారదానికేతన్‌లో ప్రస్తుతం 400 మంది చదువుతున్నట్లు తెలిపారు. ప్రముఖ రంగస్థల, సినీ నటులు తుర్లపాటి రాధా కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సంగీతం, క్రీడల్లో ప్రావీణ్యం పొందాలని సూచించారు. తిరుప్పావై అమృత వర్షిణి డాక్టర్ కోగంటి శ్రీరంగనాయకి మాట్లాడుతూ.. శారదా నికేతనం అభివృద్ధికి డాక్టర్ తమ్మారెడ్డి భరద్వాజ, నాట్కో సంస్థ, బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, పోలిశెట్టి సోమసుందరం సంస్థలు ఎంతగానో తోడ్పాటును అందించినట్లు తెలిపారు. అనంతరం ఉన్నవ లక్ష్మీబాయమ్మ జీవిత సాఫల్య పురస్కారాలను సీహెచ్ సుబ్రహ్మణ్యేశ్వరి, వేదవతికి ప్రదానం చేశారు. ప్రముఖ ప్రజా గాయకుడు పీవీ రమణ తన పాటలతో ఆలోచింపజేశారు. తొలుత ఉన్నవ లక్ష్మీనారాయణ, లక్ష్మీబాయమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్. అరుణకుమారి, విశ్రాంత వైద్యాధికారి పెద్ది సాంబశివరావు, ఉన్నవ కుటుంబ సభ్యులు హేమ, మాధవీలత, ఓరియంటల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కోటిరత్నం, సంస్థ కార్య నిర్వహణాధికారులు జి. శ్రీనివాసరావు, టి.శ్రీనివాసరావు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం యస్. ఉషారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



ధర్నాచేస్తున్న వలంటీర్లు, సీఐటీయూ నాయకులు

బాపట్ల టౌన్ : వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్ కోరారు. గ్రామ, వార్డు వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పట్టణంలో ధర్నా నిర్వహించారు. మజుందార్ మాట్లాడుతూ వలంటీర్ల బకాయి వేతనాలు చెల్లించాలని పది వేల వేతన హామీలు నెరవేర్చాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వలంటీర్ వ్యవస్థను కాపాడతామని, పదివేల రూపాయలు వేతనం చెల్లిస్తామని ఎన్నికల ముందు హామీలు ఇచ్చాయి. కానీ నేడు ఎన్నికల అనంతరం వలంటరీ వ్యవస్థ లేదని ప్రకటించడం దారుణమన్నారు. కరోనా లాంటి విపత్కర సమయంలో, విజయవాడ వరదల సమయంలో వీరు చేసిన సేవలను గుర్తు లేవా అని ప్రశ్నించారు. సకాలంలో వృద్ధులు, వితంతులకు పెన్షన్లు అందించే సమయంలో వలంటీర్ల సేవలను ప్రజలు పెద్ద ఎత్తున హర్షించారని, ధర్నా అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కోటేశ్వరి, అనూష, షేక్ షకీరా, ఎం. లక్ష్మి, ఎం జ్యోతి, కే అరుణ, సీఐటీయూ జిల్లా నాయకులు కె.శరత్ పాల్గొన్నారు.

ఆధునిక చికిత్సలపై అవగాహన అవసరం



ప్రిన్సిపల్ డాక్టర్ సుందరాచారిని సన్మానిస్తున్న దృశ్యం

గుంటూరు మెడికల్: వైద్యరంగం చాలా వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఆధునిక పద్ధతుల్లో వ్యాధి నిర్ధారణ, చికిత్సలను వైద్యులు తెలుసుకోవాలని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి అన్నారు. శుక్రవారం గుంటూరు వైద్య కళాశాలలోని జింఖానా ఆడిటోరియంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) 66వ వార్షిక సదస్సు ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ.. ఈ రాష్ట్ర సదస్సును గుంటూరు ఐఎంఏ శాఖ నిర్వహించటం అభినందనీయం అన్నారు. వైద్యరంగంలో పరిశోధనకు అవకాశాలు బాగా పెరిగాయని చెప్పారు. యువ వైద్యులు ఇందులో భాగస్వాములు కావాలన్నారు. గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ.. వైద్యులు సీఎంఈ కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ప్రారంభ దశలోనే వ్యాధులను గుర్తించి చికిత్స చేయడం ద్వారా రోగుల రద్దీని నిరోధించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ పర్యవేక్షకులు డాక్టర్ ఎం. ఫణికుమార్ మాట్లాడుతూ వైద్యులకు సంవత్సరంలో ఆరు చొప్పున ఐదు సంవత్సరాలకు 30 క్రెడిట్ అవర్స్ లేనిదే రిజిస్ట్రేషన్ రెన్యువల్ జరగదని చెప్పారు. వైద్యులందరూ కార్యక్రమాలకు తప్పక హాజరుకావాలని కోరారు. ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పి.ఫణిదర్, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ జి.నందకిషోర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ టి.సేవకుమార్, గుంటూరు ఐఎంఏ బ్రాంచ్ అధ్యక్షుడు డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు, కార్యదర్శి డాక్టర్ బాలినేని సాయికృష్ణ, సైంటిఫిక్ కమిటీ చైర్మన్ డాక్టర్ సీహెచ్ విశ్వేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఖోఖోలో కారెంపూడి విద్యార్థుల సత్తా



కారెంపూడి: రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కారెంపూడి మండలం నుంచి పది మంది రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. నేటి నుంచి పల్నాటి రణస్థలి కారెంపూడిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో సొంత గడ్డపై వారంతా ఆడనున్నారు. మండలంలోని ఒప్పిచర్ల జెడ్పీ హైస్కూల్ నుంచి బొమ్మనబోయిన లక్ష్మీప్రసన్న, షేక్ మహిమున్నీసా, మిద్దెపోగు రవికిరణ్, వీరదాసు మనోహర్‌లు కారెంపూడి బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్ నుంచి ఎస్ వరప్రసాద్, వి.సాయి నాయక్, బి.జాన్ జీవన్, ఎం.కేశవ, డి.అఖిల్, వై అక్షితలు అండర్ 14 ఉమ్మడి గుంటూరు జిల్లా బాల బాలికల జట్లలో ఆడనున్నారు. దాదాపు ఒక్కో మండలం నుంచి ఒక్కరు కూడా లేని పరిస్థితి చాలా చోట్ల ఉండగా, కారెంపూడి విద్యార్థులు మాత్రం ఖోఖోలో తమ సత్తాచాటి ఉమ్మడి జిల్లా జట్లలో స్థానం సంపాదించారు. నేడు శనివారం నుంచి బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్లో అట్టహాసంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్ 14 బాల, బాలికల రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు అట్టహాసంగా ప్రారంభం కానున్నాయి.